

కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న రాచకొండ సీపీ చౌహాన్, కలెక్టర్ గౌతమ్

# కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

**పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, సీపీ, అధికారులు**

సిటీబ్యూరో/మేడ్చల్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి కీసరలోని భోగారం హోళిమేరి కళాశాలలో ఈ నెల 3వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం రాచకొండ సీపీ డీఎస్.చౌహాన్, జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎస్.కె.జైన్, పూర్వాగార్గ్, అమన్ మిట్టల్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించి సూచనలు చేశారు. తాగు నీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులకు తావు లేకుండా సాఫీగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 3వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రశాంతమైన వాతావరణం మధ్య నిర్వహించేలా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. అధికారుల వెంట అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీసీపీ జానకి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.

# పోలింగ్ ముగిసింది.. లెక్కింపు మిగిలింది

సిటీబ్యూరో, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ) : పోలింగ్ ముగిసింది.. ఇక ఓట్ల లెక్కింపు మిగిలింది. గురువారం రాత్రి పోలింగ్ కేంద్రాల నుంచి ఆయా కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలలో ఈవీఎం మెషిన్లను అధికారులు భద్రపరిచారు. ఈవీఎంలను భద్రపరిచిన గదుల వద్దకు ఎవరినీ అనుమతించడంలేదు. మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యే వరకు ఆ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 14 లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయగా, యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మిగిలిన 13 నియోజకవర్గాలకు విడిగా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు ఒకేచోట లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా, కౌంటింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## రేపు ఓట్ల లెక్కింపు.. మద్యం దుకాణాలు బంద్

ఆదివారం ఓట్ల లెక్కింపు సందర్భంగా కేంద్రాల వద్ద ఆంక్షలు విధిస్తూ నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య, రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్‌లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు 3న ఉదయం 6 నుంచి 4వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆదివారం మద్యం దుకాణాలను మూసివేయాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు.

**నిఘా నీడలో కౌంటింగ్ కేంద్రాలు ❖ పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు**

| నియోజకవర్గం | లెక్కింపు కేంద్రాలు |
|---|---|
| **హైదరాబాద్ జిల్లా** | |
| ముషీరాబాద్ | దోమలగూడ, ఏవీ కాలేజీ |
| మలక్‌పేట | అంబర్‌పేట, ఇండోర్ స్టేడియం |
| అంబర్‌పేట | నారాయణగూడ, ఆర్‌బీ వెంకట్రామ రెడ్డి మహిళా కాలేజీ |
| ఖైరతాబాద్ | కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం, యూసుఫ్‌గూడ |
| జూబ్లీహిల్స్ | యూసుఫ్‌గూడ, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం |
| సనత్‌నగర్ | ఓయూ, కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రాంగణం |
| నాంపల్లి | మాసబ్‌ట్యాంక్, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ |
| కార్వాన్ | మాసబ్‌ట్యాంక్, గవర్నమెంట పాలిటెక్నిక్ కాలేజీ |
| గోషామహల్ | కోఠి, తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం |
| చార్మినార్ | నాంపల్లి, కమల నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీ ఆఫ్ ఉమెన్ |
| చాంద్రాయణగుట్ట | బషీర్‌బాగ్, నిజాం కాలేజీ |
| యాకుత్‌పుర | నాంపల్లి, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయ |
| బహదూర్‌పుర | బండ్లగూడ, అరోరా లీగల్ సైన్స్ అకాడమీ |
| సికింద్రాబాద్ | ఓయూ, ప్రొ.జి. రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ స్టడీ సెంటర్ |
| సికింద్రాబాద్ (కంటోన్మెంట్) | ఆనంద్ టాకీస్ ఎదురుగా, సీఎస్ఐ ఇనిస్టిట్యూట్ |
| **రంగారెడ్డి జిల్లా** | |
| ఎల్బీనగర్ | సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం |
| మహేశ్వరం | సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ (గ్రౌండ్ ఫ్లోర్) |
| రాజేంద్రనగర్ | హిమాయత్‌నగర్ లార్డ్స్ ఇంజినీరింగ్ కాలేజీ |
| శేరిలింగంపల్లి | జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియం |
| **మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా** | |
| మల్కాజిగిరి | భోగారం హోలిమేరీ ఇనిస్టిట్యూట్ ఎంబీఏ బ్లాక్ |
| కుత్బుల్లాపూర్ | భోగారం హోలిమేరీ ఇనిస్టిట్యూట్ సెమినార్ హాల్ (కొత్త భవనం) |
| కూకట్‌పల్లి | భోగారం హోలిమేరీ ఇనిస్టిట్యూట్, ఇంజినీరింగ్ బ్లాక్ |
| ఉప్పల్ | భోగారం హోలిమేరీ ఇనిస్టిట్యూట్, ఎంబీఏ బ్లాక్ |

## 7 జిల్లాలు, 29 నియోజకవర్గాలు, 20 కౌంటింగ్ సెంటర్లలో

# మూడంచెల భద్రత

**మూడు కమిషనరేట్లలోని కౌంటింగ్ సెంటర్ల వద్ద బలగాల మోహరింపు**

### సీసీ కెమెరాలతో పర్యవేక్షణ..

సిటీబ్యూరో, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలోని 7 జిల్లాలు, 29 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఓట్ల కౌంటింగ్ సెంటర్లు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ప్రజల సహకారంతో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, ఈనెల 3వ తేదీన ఓట్ల లెక్కింపు కూడా శాంతియుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని అధికారులు కోరారు. ఈవీఎం, వీవీ ప్యాట్స్ భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద గట్టి భద్రత, సీసీ కెమెరాలతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మూడు కమిషనరేట్ల పరిధిలో ఏర్పాటు చేసిన 20 కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అందులో భాగంగా కేంద్ర బలగాలు, రాష్ట్ర ప్రత్యేక బలగాలు, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు వివరించారు.




గచ్చిబౌలి స్టేడియం వద్ద ఉన్న ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద పోలీసుల బందోబస్తు

## రంగారెడ్డి జిల్లాలో...

రంగారెడ్డి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోటెత్తగా.. పట్టణాల్లోని ఓటర్లు మాత్రం పెద్దగా ఆసక్తి చూపలేదు. 2018 ఎన్నికల్లో 62 శాతం పోలింగ్ నమోదవ్వగా.. ఈ ఎన్నికల్లో 59.96 శాతం మాత్రమే నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే..2 శాతానికి పైగా ఓటర్లు తగ్గారు. మహేశ్వరం, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో గత ఎన్నికలు, ఈసారి ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తే.. ఈసారి స్వల్పంగా ఓటింగ్ పెరిగింది.

**రంగారెడ్డి జిల్లాలో నమోదైన పోలింగ్.. నియోజకవర్గాల వారీగా..**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం ఓటర్లు | 2018శాతం | 2023శాతం |
|---|---|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 1,23,968 | 1,21,483 | 08 | 2,45,459 | 76.4 | 74.03 |
| ఎల్బీనగర్ | 1,49,827 | 1,41,492 | 28 | 2,91,347 | 49.06 | 49.07 |
| మహేశ్వరం | 1,54,746 | 1,48,010 | 06 | 3,02,762 | 55.3 | 55.39 |
| రాజేంద్రనగర్ | 1,68,996 | 1,55,920 | 01 | 3,24,917 | 56.9 | 55.83 |
| శేరిలింగంపల్లి | 1,86,877 | 1,70,175 | 22 | 3,57,074 | 46.6 | 48.75 |

# బోగస్ ఓటర్లను అడ్డుకున్న సిబ్బంది.. అభినందించిన సీపీ

సిటీబ్యూరో, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిని ఎక్కడికక్కడే నియంత్రిస్తూ, బోగస్ ఓటర్లను పట్టుకొని విధి నిర్వహణలో ధైర్యసాహసాలు, జవాబుదారీతనం ప్రదర్శించిన సిబ్బందిని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య అభినందించారు. తమ దృష్టికి వచ్చిన సంఘటనలపై తక్షణమే స్పందించి మూడు ఘటనల్లో వెంటనే చర్యలు తీసుకున్న సిబ్బందిని బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు పిలిపించి వారిని అభినందించారు.

- ❖ షాహినాయత్‌గంజ్ ఠాణా పరిధిలో ఒక రాజకీయ పార్టీకి చెందిన కొంత మంది స్త్రీ, పురుషులు గొడవ పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్గించేలా వ్యవహరిస్తున్నారు. పక్కనే ఉన్న మంగళ్‌హాట్ ఠాణా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై అంబిక వెంటనే షాహినాయత్ గంజ్ పోలీసులకు సమాచారం ఇచ్చి, అక్కడ ఎలాంటి గొడవ జరగకుండా స్పందించారు. ఆమె ధైర్యంగా అక్కడి సంఘటనను అడ్డుకున్నారు.
- ❖ హబీబ్‌నగర్ ఠాణా పరిధిలోని పోలింగ్ బూత్‌లో కొందరు బోగస్ ఓట్లు వేసేందుకు ప్రయత్నించగా.. హబీబ్‌నగర్ కానిస్టేబుల్ వినయ్‌కుమార్ వాళ్లను నిలువరించి ఠాణాకు అప్పగించారు.
- ❖ ఫలక్‌నుమా ఠాణాలో పనిచేసే మహిళా కానిస్టేబుల్ బోస్లే కృష్ణకుమారి కాలాపత్తార్ ఠాణా పరిధిలోని ఎన్నికల పోలింగ్ బూత్ వద్ద విధులు నిర్వహిస్తున్నది. అక్కడ కొందరు బోగస్ ఓట్లను వేయడానికి ప్రయత్నించగా.. వాళ్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించింది.







# మారని గ్రేటర్ ఓటరు!

- గత ఎన్నికల కంటే 1.01 శాతం తగ్గిన ఓటింగ్
- 2018లో 48.89, 2023లో 47.88 శాతం నమోదు
- రాష్ట్రంలోనే అత్యంత అత్యల్పంగా నిలిచిన హైదరాబాద్
- ఎన్నిక ఏదైనా 50 శాతం దాటని ఓటింగ్‌తో విమర్శలు
- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే పెరగని ఓటింగ్ శాతం

సిటీబ్యూరో, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): కోటి మందికి పైగా నివసిస్తున్న మహానగరం. అయితే బాధ్యతాయుతంగా ఉండాల్సిన ఓటరు ప్రతీసారి ఎన్నికలకు దూరంగా ఉండటంతో ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదవుతోంది. ఏ ఎన్నికలైనా 50 శాతానికి మించి దాటడం లేదు. ఓటర్లలో నిర్లిప్తతతో పోలింగ్ కేంద్రాలకు రావడం లేదనే విమర్శలున్నాయి. ముఖ్యంగా చదువుకున్న వారు, ఐటీ ఉద్యోగులు, యువత నిరాసక్తత వదిలి ఉత్సాహంగా ఓటు వేసేలా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టిసారించినా ఫలితం ఉండటం లేదు. గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లాలో 48.89 శాతం పోలింగ్ నమోదు అయితే ఈసారి 47.88 శాతం మాత్రమే నమోదైంది. అంటే 1.01 శాతం తక్కువగా నమోదైంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే అత్యల్పంగా 47.88 శాతం నమోదు కావడం శోచనీయం. జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో పరిశీలిస్తే గోషామహల్‌లో 55.38 శాతం నమోదు కాగా, అతి తక్కువగా యాకుత్‌పురలో 39.64 శాతం నమోదైంది. మొత్తంగా ఓటింగ్‌లో పురుషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లాలో పురుషులు 11,29,959 మంది, మహిళలు 10,42,087 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం అనుకున్నంతగా పెరగకపోవడంతో తగ్గిన పోలింగ్ సరళితో ఎవరికి నష్టం! అన్నదానిపై రాజకీయ పార్టీల్లో జోరుగా చర్చ జరుగుతున్నది.

**హైదరాబాద్ జిల్లాలో నమోదైన పోలింగ్ నియోజకవర్గాల వారీగా..**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం ఓటర్లు | 2018 శాతం | 2023 శాతం |
|---|---|---|---|---|---|---|
| ముషీరాబాద్ | 78,686 | 73,862 | 2 | 1,52,550 | 52.8 | 50.55 |
| మలక్‌పేట | 67,482 | 63,872 | 0 | 1,31,354 | 42.4 | 41.32 |
| అంబర్‌పేట | 73,534 | 71,934 | 2 | 1,45,470 | 55.7 | 52.50 |
| ఖైరతాబాద్ | 79,507 | 74,626 | 13 | 1,54,146 | 53.7 | 52.07 |
| జూబ్లీహిల్స్ | 95,203 | 87,756 | 3 | 1,82,962 | 45.6 | 47.49 |
| సనత్‌నగర్ | 66,785 | 62,598 | 4 | 1,29,387 | 52.3 | 51.96 |
| నాంపల్లి | 79,740 | 71,855 | 0 | 1,51,595 | 45.5 | 45.56 |
| కార్వాన్ | 92,397 | 82,709 | 1 | 1,75,107 | 52.7 | 48.72 |
| గోషామహల్ | 80,406 | 69,443 | 8 | 1,49,857 | 58.7 | 55.38 |
| చార్మినార్ | 53,169 | 44,646 | 15 | 97,830 | 50.3 | 43.27 |
| చాంద్రాయణగుట్ట | 78,523 | 74,371 | 4 | 1,52,898 | 47.8 | 45.26 |
| యాకుత్‌పుర | 73,848 | 66,141 | 1 | 1,39,990 | 42.6 | 39.64 |
| బహదూర్‌పుర | 77,833 | 66,260 | 1 | 1,44,094 | 50.4 | 45.50 |
| సికింద్రాబాద్ | 70,834 | 70,263 | 8 | 1,41,105 | 55.4 | 53.75 |
| కంటోన్మెంట్ | 62,012 | 61,751 | 3 | 1,23,766 | 49.1 | 49.36 |
| | 11,29,959 | 10,42,087 | 65 | 21,72,111 | -- | 47.88 |

**మేడ్చల్ జిల్లాలో నమోదైన పోలింగ్ నియోజకవర్గాల వారీగా...**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం ఓటర్లు | 2018శాతం | 2023శాతం |
|---|---|---|---|---|---|---|
| మేడ్చల్ | 2,01,794 | 1,95,172 | 4 | 396790 | 60.7 | 62.24 |
| మల్కాజిగిరి | 1,34,435 | 1,29,754 | 0 | 264189 | 53.2 | 54.02 |
| కుత్బుల్లాపూర్ | 2,06,973 | 1,92,728 | 51 | 399752 | 56.1 | 57.18 |
| కూకట్‌పల్లి | 1,29,807 | 1,20,066 | 21 | 249894 | 57.8 | 53.87 |
| ఉప్పల్ | 1,39,531 | 1,33,332 | 7 | 272870 | 51.7 | 51.54 |
| | 8,12,540 | 7,71,052 | 83 | 15,83,675 | -- | 56.17 |